08-10-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - మిమ్మల్ని చదివించేందుకు తండ్రి చాలా అభిరుచి(ఇష్టము)తో వచ్చారు. మీరు కూడా అభిరుచితో చదవండి - మమ్మల్ని చదివించేవారు స్వయం భగవంతుడే అన్న నషా ఉండాలి "

**ప్రశ్న :-** బ్రహ్మాకుమార-కుమారీల ఆశయము లేక శుద్ధమైన భావము ఏది ?

**జవాబు:-** 5 వేల సంవత్సరాల క్రితము వలె మళ్ళీ శ్రీమతమునుసరించి విశ్వములో సుఖ-శాంతుల రాజ్యాన్ని స్థాపించడమే మీ ఆశయము. శ్రీమతమును అనుసరించి మేము విశ్వమంతటికీ సద్గతినిస్తామనేదే మీ శుద్ధ భావన. మేము అందరికీ సద్గతినిచ్చేవారమని మీరు నషాతో అంటారు. మీకు తండ్రి నుండి శాంతి బహుమతి (Peace Prize) లభిస్తుంది. నరకవాసుల నుండి స్వర్గవాసులుగా అగుటే బహుమతి తీసుకోవడం.

**ఓంశాంతి.** విద్యార్థులు చదువుకునేటప్పుడు సంతోషంగా చదువుకుంటారు. టీచరు కూడా చాలా సంతోషంగా, రుచితో చదివిస్తారు. అనంతమైన తండ్రి టీచరుగా అయి మనలను చాలా ఆసక్తితో చదివిస్తున్నారని ఆత్మిక పిల్లలైన మీకు తెలుసు. ఆ చదువులో తండ్రి వేరుగా ఉంటారు, చదివించే టీచరు వేరుగా ఉంటారు. ఎవరో కొంతమందికి తండ్రే టీచరుగా కూడా ఉంటారు. కనుక చాలా ఆసక్తితో చదివిస్తారు. ఎందుకంటే రక్త సంబంధము కదా. తన పిల్లలను తండ్రి చాలా ఆసక్తితో చదివిస్తారు. ఈ తండ్రి కూడా మనలను చాలా ఆసక్తిగా చదివిస్తారు కనుక పిల్లలు కూడా అలాగే చాలా అభిరుచితో చదువుకోవాలి. నేరుగా తండ్రే చదివిస్తున్నారు. ఒక్కసారి మాత్రమే వచ్చి చదివిస్తారు. పిల్లలకు చాలా ఆసక్తి ఉండాలి. మన తండ్రి అయిన భగవంతుడు మనలను చదివిస్తున్నారు. ప్రతి విషయాన్ని చాలా బాగా విశదీకరిస్తున్నారు. కొంతమంది పిల్లలకు చదువుతూ చదువుతూ కొన్ని సంకల్పాలు వస్తాయి - " ఇదేమిటి? డ్రామాలో వచ్చిపోయే ఈ చక్రముంది, కాని అసలు ఈ నాటకమే ఎందుకు రచింపబడింది? దీని వలన లాభమేమి? ఇలాగే చక్రములో తిరగడం కంటే దీని నుండి విడుదలవుతే మంచిది కదా" అని అనుకుంటారు. ఈ 84 జన్మల చక్రములో తిరుగుతూనే ఉండాలి అని తెలుసుకున్నప్పుడు, ఇటువంటి ఆలోచనలు వస్తూ ఉంటాయి. " భగవంతుడు ఇలాంటి నాటకమెందుకు రచించారు? వచ్చి పోయే ఈ చక్రము నుండి విడుదల కాలేని ఈ నాటకమెందుకు? దీని కంటే మోక్షము లభిస్తే మంచిది " అనే ఆలోచన కొంతమంది పిల్లలకు వస్తుంది. ఇలా వచ్చి పోవడం నుండి, సుఖ-దుఃఖాల నుండి విడుదలవ్వాలని భావిస్తారు. తండ్రి అంటున్నారు - మీరనుకున్నట్లు జరగనే జరగదు. మోక్షము పొందేందుకు ప్రయత్నించడం వ్యర్థము. తండ్రి అర్థం చేయిస్తున్నారు - ఒక్క ఆత్మ కూడా పాత్ర నుండి విడుదల కాలేదు. ఆత్మలో అవినాశి పాత్ర నిండి ఉంది. అది అనాది అవినాశి. పూర్తి ఖచ్చితమైన పాత్రధారులు. ఒక్కరు కూడా ఎక్కువ, తక్కువ అయ్యేందుకు అవకాశము లేదు. పిల్లలైన మీకు జ్ఞానమంతా తెలుసు. ఈ డ్రామాలో పాత్ర చేయకుండా, ఎవ్వరూ విడుదల అవ్వలేరు. ఎవ్వరికీ మోక్షము కూడా లభించదు. అన్ని ధర్మాలవారు నెంబరువారుగా వచ్చే తీరాలి. తండ్రి అర్థము చేయిస్తున్నారు - ఇది తయారైన అవినాశి

డ్రామా. బాబా ఇప్పుడు మేము 84 జన్మలు చక్రములో ఎలా తిరుగుతామో తెలుసుకున్నామని మీరు కూడా అంటారు. అంతేకాక మొదట వచ్చేవారు 84 జన్మలు తీసుకుంటారని, వెనుక వచ్చేవారికి తప్పకుండా తక్కువ జన్మలుంటాయని కూడా మీరు అర్థం చేసుకున్నారు. ఇక్కడ పురుషార్థము చేయాలి. పాత ప్రపంచము నుండి నూతన ప్రపంచము తప్పకుండా తయారవ్వాలి. బాబా ప్రతి విషయాన్ని అనేకసార్లు అర్థం చేయిస్తూ ఉంటారు. ఎందుకంటే క్రొత్త - క్రొత్త పిల్లలు వస్తూ ఉంటారు. వారికి పాత చదువునెవరు చదివిస్తారు? కావున క్రొత్తవారిని చూచి పాత పాయింట్లు రిపీట్ చేస్తారు.

మీ బుద్ధిలో మొత్తం జ్ఞానమంతా నిండి ఉంది. ప్రారంభము నుండి మనమెలా పాత్ర చేస్తూ వచ్చామో మీకు తెలుసు. నెంబరువారుగా ఎలా వస్తారో, ఎన్ని జన్మలు తీసుకుంటారో యదార్థంగా తెలుసు. ఈ సమయములోనే తండ్రి వచ్చి మీకు మాత్రమే ఈ జ్ఞాన విషయాలు వినిపిస్తారు. సత్యయుగములో ప్రాలబ్ధముంటుంది. ఇదంతా ఈ సమయములో మీకు మాత్రమే అర్థం చేయించబడ్తుంది. *గీతలో కూడా ప్రారంభములోనూ, చివరిలోనూ 'మన్మనాభవ' అనే పదము వస్తుంది.* హోదా (ఉన్నత పదవి) పొందేందుకు చదివిస్తున్నారు. మీరు రాజులుగా అయ్యేందుకు ఇప్పుడు పురుషార్థము చేస్తున్నారు. ఇతర ధర్మాల వారిని గురించి అర్థము చేయించడం జరుగుతుంది. వారు నెంబరువారుగా ధర్మస్థాపకుల వెనుక అందరూ రావలసి ఉంటుంది. వారికి రాజ్య పదవి ఉండదు. ఒక్క గీతా శాస్త్రానికి మాత్రమే చాలా చాలా గొప్ప మహిమ ఉంది. భారతదేశములోనే తండ్రి వచ్చి వినిపించి, సర్వులకు సద్గతినిస్తారు. ఆ ధర్మస్థాపకులైన వారు మరణిస్తే గొప్ప - గొప్ప తీర్థ స్థానాలు కట్టిస్తారు. వాస్తవానికి అందరికీ ఈ భారతదేశము ఒక్కటే తీర్థస్థానము, ఇక్కడ అనంతమైన తండ్రి వస్తారు. తండ్రి భారతదేశములోనే వచ్చి సర్వులకు సద్గతినిస్తారు. తండ్రి అంటున్నారు - నన్ను లిబరేటర్, మార్గదర్శకుడు అని అంటారు కదా. నేను మిమ్ములను ఈ పాత దుఃఖ ప్రపంచము నుండి విడుదల చేయించి శాంతిధామము, సుఖధామములోకి తీసుకెళ్తానని పిల్లలకు తెలుసు. బాబా మనలను శాంతిధామము, సుఖధామానికి తీసుకెళ్తారని పిల్లలకు తెలుసు. మిగిలిన వారంతా శాంతిధామానికి వెళ్ళిపోతారు. బాబా వచ్చి దుఃఖధామము నుండి లిబరేట్ చేస్తారు. వారికి జనన-మరణాలు లేనే లేవు. తండ్రి వచ్చారు, మళ్ళీ వెళ్ళిపోతారు. వారు మరణించారని అనరు. శివానందుడైతే శరీరాన్ని వదిలేశారని అంత్యక్రియలు చేస్తారు. ఈ తండ్రి వెళ్ళిపోయినప్పుడు వీరికి అంత్యక్రియలు, తద్దినాలు మొదలైనవేవీ చేయరు. వారు వచ్చేది కూడా ఎవ్వరికీ తెలియదు. అంత్యక్రియలు మొదలైనవాటి మాటే లేదు. మిగిలిన మనుష్యులందరికీ అంత్యక్రియలు చేస్తారు. తండ్రికి అంత్యక్రియలే లేవు. వారికి శరీరమే లేదు. మనుష్యులందరూ ఆవాల వలె నలిగి సమాప్తమైపోతారు. సత్యయుగములో ఈ జ్ఞానము గానీ, భక్తి విషయాలు గానీ ఏవీ ఉండవు. ఇవి ఇప్పుడు మాత్రమే ఉంటాయి. మిగిలినవారంతా భక్తి మాత్రమే నేర్పిస్తారు. అర్ధకల్పము భక్తి ఉంటుంది. మళ్ళీ అర్ధకల్పము తర్వాత తండ్రి వచ్చి జ్ఞాన వారసత్వమునిస్తారు. జ్ఞానము అక్కడకు మీ వెంట రాదు. అక్కడ తండ్రిని స్మృతి చేసే అవసరమే ఉండదు. ముక్తిలో ఉంటారు. అక్కడేమైనా స్మృతి చేయడం ఉంటుందా? అక్కడ దుఃఖము గురించి ఫిర్యాదులే ఉండవు. భక్తి కూడా మొదట అవ్యభిచారిగా ఉండి, తర్వాత వ్యభిచారిగా అవుతుంది. ఇప్పుడైతే భక్తి అతివ్యభిచారిగా ఉంది. దీనిని రౌరవ నరకమని అంటారు. ఇది తీవ్రమైన, గాఢమైన నరకము. తండ్రి వచ్చి అత్యంత శ్రేష్ఠమైన స్వర్గంగా చేస్తారు. ఇప్పుడు నూటికి నూరు శాతము దుఃఖముంది.

మళ్ళీ నూటికి నూరు శాతము సుఖము, శాంతి ఉంటుంది. ఆత్మ తన ఇంటికి వెళ్ళి విశ్రాంతి పొందుతుంది. ఈ విషయాలు అర్థము చేయించడం చాలా సులభము. తండ్రి అంటున్నారు - నూతన ప్రపంచాన్ని స్థాపించి పాత దానిని వినాశనము చేయవలసినప్పుడు నేను వస్తాను. ఇంత పెద్ద కార్యాన్ని కేవలం ఒక్కరే చేయరు కదా. సేవాధారులు చాలా మంది కావాలి. ఇప్పుడు మీరు తండ్రికి సేవాధారి పిల్లలుగా అయ్యారు. ముఖ్యంగా భారతదేశానికి సత్యమైన సేవ చేస్తున్నారు. సత్యమైన తండ్రి సత్యమైన సేవ నేర్పుతున్నారు. స్వయం మీ కళ్యాణము, భారతదేశ కళ్యాణము, అంతేకాక విశ్వ కళ్యాణము కూడా చేస్తారు. కావున ఎంతో అభిరుచితో సేవ చేయాలి. బాబా ఎంతో రుచితో సర్వులకు సద్గతినిస్తున్నారు. ఇప్పుడు కూడా సర్వుల సద్గతి తప్పకుండా జరుగుతుంది. ఇది శుద్ధ అహంకారము, శుద్ధ భావన.

మీరు సత్యమైన సేవ చేస్తున్నారు కానీ గుప్తంగా చేస్తారు. ఆత్మ శరీరము ద్వారా చేస్తుంది. చాలామంది మిమ్ములను బి.కెల ఆశయము ఏమిటి? అని అడుగుతారు. బి.కె.ల ఉద్దేశ్యము సత్యయుగ సుఖ-శాంతుల స్వరాజ్యాన్ని స్థాపించడం అని చెప్పండి. మేము ప్రతి 5 వేల సంవత్సరాల తర్వాత శ్రీమతమును అనుసరించి విశ్వములో శాంతిని స్థాపన చేసి విశ్వశాంతి బహుమతిని తీసుకుంటాము, యథా రాజా రాణి తథా ప్రజ అందరము బహుమతి తీసుకుంటాము అని కూడా చెప్పండి. నరకవాసుల నుండి స్వర్గవాసులుగా అవ్వడం తక్కువ బహుమతా! వారు శాంతి పురస్కారాలు తీసుకొని సంతోషపడ్తూ ఉంటారు. కాని వారికేమీ లభించదు. సత్య-సత్యమైన బహుమతి విశ్వానికి చక్రవర్తి పదవిని ఇప్పుడు మనము తండ్రి నుండి తీసుకుంటున్నాము. మా భారతదేశము ఉన్నతమైనదని అంటూ ఎంతో మహిమ చేస్తారు కదా. అందరూ మేము భారతదేశానికి అధికారులమని భావిస్తారు. కాని యజమానులుగా ఎక్కడున్నారు! ఇప్పుడు పిల్లలైన మీరు తండ్రి శ్రీమతమును అనుసరించి రాజ్య స్థాపన చేస్తున్నారు. ఏ ఆయుధాలూ, ఏ శక్తీ అవసరము లేదు. దైవీగుణాలు ధారణ చేస్తారు. మీకే గాయనము, పూజలు జరుగుతాయి. జగదంబను చూడండి, ఎన్ని పూజలు జరుగుతాయి? కాని జగదంబ(అంబ) ఎవరు? బ్రాహ్మణినా? దేవతనా? అనేది కూడా తెలియదు. అంబ, కాళి, దుర్గ, సరస్వతి మొదలైన పేర్లు చాలా ఉన్నాయి. ఇక్కడ కూడా అంబకు చిన్న గుడి ఉంది. అంబకు చాలా భుజాలు చూపిస్తారు. అలా లేనే లేవు. దానిని గుడ్డి నమ్మకమని అంటారు. ఏసుక్రీస్తు, బుద్ధుడు మొదలైనవారు వచ్చారు. వారు వారి వారి ధర్మాలను స్థాపన చేశారు. తేదీతో సహా తెలుపుతారు. అక్కడ మూఢ నమ్మకము మాటే లేదు. ఇక్కడ భారతవాసులకు ఏ మాత్రమూ తెలియదు. తమ ధర్మాన్ని ఎవరు, ఎప్పుడు స్థాపన చేశారో కూడా తెలియదు. అందువలన మూఢ నమ్మకమనే అంటారు. ఇప్పుడు మీరు పూజారులుగా ఉన్నారు మళ్ళీ పూజ్యులుగా అవుతారు. మీ ఆత్మ పూజనీయమైతే, శరీరము కూడా పూజనీయంగా అవుతుంది. మీ ఆత్మలకు కూడా పూజ జరుగుతుంది. దేవతలైన తర్వాత కూడా పూజలు జరుగుతాయి. తండ్రి నిరాకారులు. వారు సదా పూజ్యులే. వారు ఎప్పుడూ పూజారిగా అవ్వరు. పిల్లలైన మీరే పూజ్యులుగా, పూజారులుగా అవుతారు. తండ్రి సదా పూజ్యులే. ఇక్కడకు వచ్చి తండ్రి సత్యమైన సేవ చేస్తున్నారు. సర్వులకు సద్గతినిస్తారు. తండ్రి అంటున్నారు - ఇప్పుడు నన్ను ఒక్కరిని మాత్రమే స్మృతి చేయండి. ఇతర దేహధారులనెవ్వరినీ స్మృతి చేయరాదు. ఇక్కడ గొప్ప - గొప్ప లక్షాధికారులు, కోటీశ్వరులు పోయి అల్లా, అల్లా అని అంటూ ఉంటారు. ఎంత గ్రుడ్డి నమ్మకము! తండ్రి మీకు సోహమ్ సో అర్థము కూడా తెలిపించారు. వారు శివోహమ్ అని అనగా - ఆత్మనే పరమాత్మ

అని అంటారు. ఇప్పుడు తండ్రి సరియైన అర్థము తెలిపించారు. భక్తిమార్గములో విన్నది రైటా(సత్యమా)? లేక ఇప్పుడు మేము చెప్పింది రైటా? అని మీరే నిర్ణయించండి. హమ్ సో అర్థము చాలా పెద్దదిగా ఉంది. మనమే బ్రాహ్మణులు, దేవతలు, క్షత్రియులుగా అయ్యాము. హమ్ సో యొక్క రైటు అర్థము ఏది? మనము ఆత్మలము చక్రములో ఇలా వస్తాము. విరాట రూప చిత్రము కూడా ఉంది. ఇందులో శిఖ అయిన బ్రాహ్మణులను, తండ్రిని చూపించలేదు. దేవతలెక్కడ నుండి వచ్చారు? ఎక్కడ జన్మించారు? కలియుగంలో ఉండేది శూద్ర వర్ణము, సత్యయుగంలో ఉన్నట్లుండి దేవతా వర్ణము ఎలా వచ్చింది? ఈ విషయాలేవీ కొంచెం కూడా అర్థము చేసుకోరు. భక్తిమార్గములో మనుష్యులు ఎంతో చిక్కుకొనిపోయారు. ఎవరైనా గ్రంథమును(సిక్కుల) చదివి, ఆలోచన వస్తూనే మందిరాన్ని కట్టిస్తారు. కూర్చొని గ్రంథము చదివి వినిపిస్తారు, చాలామంది మనుష్యులు వస్తారు. అనేక శిష్యులు ఏర్పడ్తారు. లాభమేమీ ఉండదు. చాలా దుకాణాలు తెరిచారు. ఇప్పుడు ఆ దుకాణాలన్నీ సమాప్తమైపోతాయి. ఈ దుకాణాలన్నీ భక్తిమార్గానికి చెందినవి. వీటి ద్వారా చాలా ధనాన్ని సంపాదిస్తారు. సన్యాసులు మేము బ్రహ్మయోగులమని, తత్వయోగులమని అంటారు. భారతదేశములోని వారు వాస్తవానికి దేవీ దేవతా ధర్మానికి చెందినవారు. కాని హిందూ ధర్మమని అంటారు. అలాగే బ్రహ్మము అనేది ఆత్మలుండే తత్వము. వారేమో బ్రహ్మ జ్ఞానులు, తత్వజ్ఞానులమని పేర్లుంచుకున్నారు. బ్రహ్మ తత్వము, ఆత్మలుండే స్థానము. అందుకే తండ్రి అర్థం చేయిస్తున్నారు - చాలా పెద్ద తప్పు చేసేశారు. ఇదంతా భ్రమ. నేను వచ్చి భ్రమలన్నీ దూరము చేస్తున్నాను. భక్తిమార్గములో ఓ ప్రభూ! నీ గతి, మతి భిన్నమైనదని అంటారు. గతిని(మోక్షము) ఎవ్వరూ ఇవ్వలేరు. సలహాలు అనేకమంది ఇస్తారు. ఇక్కడి ఈ మతము ఎంతో అద్భుతము చేసేస్తుంది. మొత్తం విశ్వమంతటినీ పరివర్తన చేసేస్తుంది.

ఇప్పుడు ఇన్ని ధర్మాలు ఎలా వచ్చాయో మీ బుద్ధిలో ఉంది. మళ్లీ ఆత్మలు వెళ్లి తమ-తమ సెక్షన్లలో ఉంటారు. ఇదంతా డ్రామాలో నిర్ణయించబడి ఉంది. దివ్యదృష్టిదాత ఒక్క బాబాయే అని కూడా పిల్లలకు తెలుసు. బాబా ఈ దివ్యదృష్టి తాళం చెవిని మాకిస్తే మేము ఎవ్వరికైనా సాక్షాత్కారము చేయిస్తామని అంటారు. కాని ఇది ఎవ్వరికీ లభించదని తండ్రి అంటున్నారు. దానికి బదులు నీకు మళ్లీ విశ్వానికి చక్రవర్తి పదవినిస్తాను. నేను ఆ పదవిని తీసుకోను. సాక్షాత్కారము చేయించడం నా పాత్రయే. సాక్షాత్కారమవుతే ఎంతో సంతోషిస్తారు. దాని ద్వారా ఏమీ లభించదు. సాక్షాత్కారముతో ఎవ్వరూ నిరోగులుగా అవ్వరు. ధనము కూడా లభించదు. మీరాబాయికి సాక్షాత్కారమయ్యింది కాని ముక్తిని పొందలేదు. ఆమె వైకుంఠములో ఉండేదని మనుష్యులు భావిస్తారు. కాని వైకుంఠము అనగా కృష్ణపురము ఎక్కడుంది? ఇవన్నీ సాక్షాత్కారాలు. తండ్రి కూర్చొని అన్ని విషయాలు అర్థము చేయిస్తున్నారు. ఇతనికి కూడా మొట్టమొదట విష్ణు సాక్షాత్కారమవుతూనే చాలా సంతోషించాడు. నేను మహారాజుగా అవుతానని కూడా సాక్షాత్కారములో చూశాడు. అంతేకాక వినాశనాన్ని, స్వర్గ రాజ్యమును కూడా చూశాడు. అప్పుడు నేను విశ్వానికి యజమానిగా అవుతానని నిశ్చయమేర్పడింది. తండ్రి ప్రవేశించాడు. బాబా ఇదంతా మీరు తీసుకోండి. నాకు విశ్వచక్రవర్తి పదవి కావాలి అని ఈ బాబా అన్నాడు. మీరు కూడా ఈ వ్యాపారము చేసేందుకు వచ్చారు కదా. ఎవరు జ్ఞానము తెలుసుకుంటారో, వారి భక్తి సమాప్తమైపోతుంది. మంచిది.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. దైవీ గుణాలను ధారణ చేసి శ్రీమతమునసరించి భారతదేశానికి సత్యమైన సేవ చేయాలి. స్వయానికి, భారతదేశానికి, విశ్వమంతటికి చాలా చాలా అభిరుచితో కళ్యాణము చేయాలి.
2. డ్రామాలోని అనాది-అవినాశి నిశ్చయాలను, యదార్థంగా అర్థము చేసుకొని సమయాన్ని వృథా చేసే పురుషార్థమేదీ చేయరాదు. వ్యర్థ సంకల్పాలు కూడా చేయరాదు.

## వరదానము :- " ఏకాగ్రతను అభ్యసించడం ద్వారా ఏకరస స్థితిని తయారు చేసుకునే సర్వసిద్ధి స్వరూప భవ "

ఎక్కడైతే ఏకాగ్రత ఉంటుందో అక్కడ స్వతహాగా ఏకరస స్థితి ఉంటుంది. ఏకాగ్రతతో చేసే సంకల్పాలు, మాటలు మరియు కర్మల వ్యర్థము పూర్తిగా సమాప్తమైపోతుంది, సమర్థత వచ్చేస్తుంది. ఏకాగ్రత అనగా ఒకే శ్రేష్ఠమైన సంకల్పంలో స్థితమై ఉండడం. ఆ ఒక్క బీజరూప సంకల్పంలో మొత్తం వృక్ష రూపి విస్తారమంతా ఇమిడి ఉంది. ఏకాగ్రతను పెంచుకుంటే అన్ని విధాలైన అలజడులు సమాప్తమై పోతాయి. అన్ని సంకల్పాలు, మాటలు మరియు కర్మలు సహజంగా సిద్ధమైపోతాయి. అందుకు ఏకాంతవాసులుగా అవ్వండి.

## స్లోగన్ :- " ఒకసారి చేసిన తప్పును గురించి పదే పదే ఆలోచించడం అనగా మచ్చ పై మచ్చ వేయడం, అందువలన గతించినదానికి బిందువు పెట్టండి. "